# ప్రేమించే మనసు

-అడపా రామకృష్ణ

**పెళ్ళి చూపులు పూర్తి కాగానే శాంత్రో డిఎక్స్ లైట్‌బ్లూ కారులో నరసింహం, సత్యవతి బయలుదేరారు. పెళ్ళి కొడుకు ప్రదీప్ ముందు సీట్లో కూర్చొని కారు వేగంతోపాటు మొద్దుబారిన మెదడును పదును పెడుతూ, మనసులో పరిపరి విధాలుగా ఆలోచించసాగాడు.**

**వె**నుక సీట్లో కూర్చున్న నరసింహం, సత్యవతి సగం దించిన అద్దాల్లో నుంచి కనిపిస్తున్న దృశ్యాల్ని మౌనంగా వీక్షిస్తూ, కొడుకు తన నిర్ణయాన్ని ఏ విధంగా బేరీజు వేస్తున్నాడోనని లెఖ్ఖలు కడుతున్నారు.

ప్రదీప్ మాత్రం తల్లీ తండ్రిని లోలోన శాపనార్థాలు పెడుతూ చిరాకు పడసాగాడు.

'వీళ్ళకెందుకింత పట్టుదల. అందం చందం లేని, ఈడూజోడు కుదరని అమ్మాయిని చూపించారు. ఎంతో ఆస్తి వుండి, ముప్పై ఎకరాల మాగాణీ, నాలుగైదు ఇళ్ళు, ఒళ్ళంతా పోతపోసుకున్నా ఇంకా తరగని బంగారం, అన్ని సౌకర్యాలున్న ధనవంతుల అమ్మాయి, ఇంకా ఏం కావాలని మొండిగా అడుగుతున్నారు. అన్నింటిని మించినదీ, కావలసినదీ సొగసు. కనీసం మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా లేకపోయినా చూడ తగ్గదైనా కావాలి కదా! మనసులేని మనుగడతో సుఖంగా సంసారం సాగుతుందా? ఒక మారుచూస్తే చాలు ఆకారం వికారం పుడుతోంది. మొద్దుమొహం, చప్పిడి ముక్కు, భారీ శరీరం, తీరూతెన్నూలేని పళ్ళవరస, ఎవరిష్ట పడతారు. ఆరు నూరైనా ఈ సంబంధం చేసుకునేది లేదు' ప్రదీప్ ఆలోచనా వలయంలో కొట్టుమిట్టాడి, చివరికి ఒక తుది రూపానికొచ్చినట్టు గుండెనిండా తృప్తిగా గాలి పీల్చుకున్నాడు.

సగం దించిన అద్దాల్లో నుంచి రివ్వున వీచే చల్ల గాలికి నరసింహానికి, సత్యవతికి మాగన్ను నిద్రపట్టేసింది. మెలుకువ వచ్చేసరికి సువిశాలమైన గార్డెన్‌లో నుంచి పోర్టికోలోకి వచ్చి ఆగింది. ప్రదీప్ దూకుడుగా కారు దిగి, కోపంగా విసవిసలాడుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

హాల్లోకి వచ్చి సోఫాలో చతికిలపడిపోయిన నరసింహం, సత్యవతికి, ఇంట్లో నౌకరు మంచినీళ్ళు, టీ తెచ్చి పెట్టింది. తాగేక సేదదీరినట్టయింది ఇద్దరికీ.

''చూశావా, వాడేం మాట్లాడటం లేదు. ఇష్టం లేనట్టుగా కనిపిస్తోంది వాడి తీరు చూస్తుంటే'' అన్నాడు కనుబొమ్మలు ఎగరేస్తూ అనుమానంగా నరసింహం.

''ఇష్టం, అయిష్టం వాడే నిర్ణయించుకుంటే మన పెద్దరికం దేనికండీ, మంచిరోజు చూసుకొని వారికి కబురు చేయాలి కదా'' సూటిగా అడిగింది సత్యవతి భర్తను.

''వాడేం చిన్నపిల్లాడు కాదు, ఎగ్జిక్యూటివ్ జాబ్‌చేస్తున్నాడు. వాడి మనసుకు వ్యతిరేకంగా ఏం చేసినా, బాధపడేది మనమే'' అన్నాడు నరసింహం. గొంతుకలో కొంచం నీరసం పాళ్ళు కనిపించాయి.

''అంచేత ఎటూ తేల్చక, కాలయాపన చేస్తారా? ఏ సంగతీ తెలియాలి కదా'' అంటూ సత్యవతి భర్త మీదనే భారం అంతా వేసింది.

నరసింహం ఇరకాటంలో పడ్డట్టు ముఖం వ్రేలాడదీశాడు. ఇదేమంత తేలికైన సమస్య కాదు. జీవితంలో అన్యోన్యంగా కలకాలం బతకాలంటే ఆచితూచి అడుగు వేయవలసిందే. తొందరపాటు నిర్ణయాలు జరిగితే అధోగతి పాలుకావాలి. గతంలో తన జీవితంలో కూడా ఇలాంటి సంఘటనలు ఎన్నో తారసిల్లాయి అనుకున్నాడు నరసింహం.

OOO

''రేపు టోర్నమెంట్‌కి వెళ్ళాలి, టెన్నీస్ బ్యాట్, కాన్వాస్ షూస్, డ్రెస్సు కొనుక్కోవాలి'' అప్పుడే ఇంటికొచ్చిన తండ్రి వీరబాబుని అడిగాడు నరసింహం.

''అమ్మకిచ్చాను. నీ కిష్టమొచ్చినవి అడిగి కొనుక్కో'' అని చెప్పాడు వీరబాబు. ఆ ఇంటికి పెద్ద కొడుకు నరసింహం. తండ్రి పెద్ద వర్క్‌షాపులో చిన్న ఉద్యోగం. ముగ్గురు కొడుకుల్లో తెలివైన వాడు, చురుకైన వాడు నరసింహమే. తల్లిదండ్రులిద్దరికీ అమిత ప్రేమ, గారాబం, కూతురు ఆఖరున పుట్టింది కావున అంత పట్టింపులేదెవరికీ.

నరసింహం ముద్దుల కొడుకుగా కోరిందే తడవు అన్నీ సమకూరేవి. చదువుకు చదువు, ఆటకి ఆట, ఇంటికి పేరు ప్రతిష్టలు రావాలంటే అది ఇతనొక్కడి వల్లే అని గొప్ప నమ్మకం. అప్పు చేసైనా ఏ లోటు రాకుండా చూసుకోవడం తప్పనిసరి అన్నట్టు నడుచుకునే వారు. మిగతా పిల్లలు ఎంత వెనుకబడి ఉన్నా లెక్కలో విషయం కాదు.

నరసింహం పోస్ట్ గ్రాడ్యుయేట్ చేశాడు. డిగ్రీ చేతికి రాగానే అకౌంటెంట్‌గా విశాఖపట్నంలో స్థిరపడ్డాడు. సంపాదనాపరుడు కావడంతోటే పెళ్ళి చేయాలనే తలంపు వచ్చింది. చదువుకున్నాడు, బుద్ధిమంతుడు అని అందరిలో గుర్తింపు రావడంతో సంబంధాలు వాటంతటవే రావడం మొదలయ్యాయి. అప్పటికే వీరబాబు చాలీచాలని సంపాదనతో సతమతమవసాగాడు. భార్య ప్రోద్బలంతో రెండు పోర్షన్ల ఇల్లు మాత్రం కట్టగలిగాడు. సగం అద్దెకిచ్చి సాదాసీదాగా బతుకు భారంగా నడిపించసాగాడు.

పెళ్ళి తతంగం మొదలైంది. అమ్మాయిని చూడ్డానికి కనీసం పెళ్ళి చూపులకైనా రావాలని నరసింహం కోరుకోకపోవడం, ముహూర్తాల టైంకి వచ్చి చేరతానని కబురు చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది.

పెళ్ళి కొడుకు అంత నెమ్మదస్తుడు, బుద్ధిమంతుడు దొరకడం అమ్మాయి చేసుకున్న మహాభాగ్యం అనుకున్నారు కొందరు. అందరితోపాటు పెళ్ళి కూతురుకి కూడా అమిత గౌరవం ఏర్పడినా, కలవారి అమ్మాయికి అహంభావం ఎక్కడికి పోతుంది. హోదాలో తమ కన్నా చిన్న వారవటం వలనే అమ్మాయిని నేరుగా చూడకుండా, గుణగణాలు తెలుసుకోకుండా పెళ్ళికి ఒప్పుకున్నాడని, అమాయకుడు, అణిగిమణిగి ఉండే తత్త్వం కాబోలని భావించారు.

శ్రీరస్తు, శుభమస్తు, అవిఘ్నమస్తు అంటూ పెద్దల ఆశీర్వచనాలతో ఘనంగా వివాహ మహో

త్సవం ముగిసింది.

నరసింహం పెళ్ళి కూతురు సత్యవతిని శోభనం గదిలోనే చూశాడు. మేలి ముసుగులో, సిగ్గుతో తలదించుకున్నా, కొనదేలిన ముక్కు, బారెడేసి కళ్ళు, ముద్దమందారంలా మురిపించే మోము, శృంగార దేవతలా సింగారించుకొంది. ఆమెకున్న ఐశ్వర్యం, దర్జా చూసి మిన్నకుండిపోయాడు.


కొత్త కోడలు అడుగుపెట్టిన వేళావిశేషం ఎంతో బాగుందనుకుని రత్నం మురిసిపోయింది. కాని ఆకాశంలో మబ్బులచాటున దాగిన విద్యుత్ ఘాతంలా విరుచుకు పడుతుందనుకోలేదు.

''అబ్బో! ఇదేంటి, ఈ ఇంట్లోనా మీరుండేది. మా పని వాళ్ళు కూడా ఇంత ఇరుకు గదుల్లో ఉండరు.''

''మా ఇంట్లో ఒకరికొకరం ఎదురు పడేది లేదు, ఎవరి గదులు వారికే ఉంటాయి.''

''డ్రాయింగ్ రూమేది? డ్రెస్సింగ్ రూముందా. బెడ్‌రూం, కిచెన్, అటాచ్‌డ్ - ఇవన్నీ వుంటేనే ఈ ఇంట్లో ఉండేది. ఈ జన్మకు మీరేమీ సమకూర్చలేరు. నేను ఇక్కడ ఎంతమాత్రం ఉండలేను. పదండి, వెళ్దాం. నేనేదో అనుకున్నాను'' అంటూ నరసింహంతో పాటు ఇంట్లో అందర్నీ ఎందుకూ






పనికిరాని వాజమ్మల్లా జమకట్టేసింది.

కోడలు పైమెరుగులు చూసి మురిసిపోయిన రత్నం ఆమె అంతర్గత దుష్ప్రభావాన్ని అంచనా వేయలేకపోయింది. ఏం చేయాలో తోచక తల దించుకుంది.

అనూహ్యమైన ఈ పరిణామానికి ఖిన్నుడై కుక్కిన పేనులా తలదించుకున్నాడు నరసింహం.

మొక్కుబడికి ఆ సాయంత్రం వరకు ఉండి భర్తను వెంట పెట్టుకుని వెళ్ళిపోయింది.

వీరబాబు, రత్నం మనసు రాయి చేసుకున్నారు. ఎక్కడో ఒక దగ్గర సుఖంగా ఉంటే అదే చాలనుకున్నారు.

ఉద్యోగ రీత్యా నరసింహం విశాఖపట్నంలో స్థిరపడ్డాడు. మొదట్లో తనకొచ్చే జీతంలో కొంత సొమ్ము తండ్రికి పంపేవాడు. అది ఆమెకు నచ్చలేదు. అడ్డుపుల్ల వేసింది. నరసింహంలో ఎక్కడో కొద్దిపాటి అభిమానం మిగిలి ఉండటంతో తండ్రి ఎక్కడ బాధపడతాడోనని చిన్న తమ్ముడ్ని చదువుకు పంపమన్నాడు. రెండేళ్ళు చదువుకోసం వచ్చిన, ఆఖరి పబ్లిక్ ఎగ్జామినేషన్ వెళ్ళే ముందర హాల్ టికెట్ మిస్ కావడంతో పరీక్ష ఫెయిల్ అయ్యాడు. అంత డబ్బు నీళ్ళ ధారలా వృధా అయిందని వెనక్కు పంపించే వరకు నిద్రపోలేదు సత్యవతి.

రోజులు దొర్లాయి. ఎన్నడూ కోరని కోరికతో ఉత్తరం వ్రాశాడు తండ్రి నరసింహానికి. తన బాధ్యతల్లో ఇంటికి పెద్ద కొడుకుగా కొంతైనా భాగం పంచుకోమని, చెల్లెలెకు మంచి సంబంధం వచ్చినందువల్ల కట్నాల చెల్లింపు దృష్టిలో వుంచుకుని కొంత డబ్బు సర్దుబాటు చేయమని అర్థించాడు అదీ చేబదులుగానే. ఉద్యోగం నుండి రిటైరయ్యాక ఆ మొత్తం తిరిగి చెల్లించగలమని వాగ్దానం కూడా చేశాడు.

సత్యవతి అజమాయిషీ చూయిస్తుండటం వలన నరసింహం తన నిస్సహాయతను తెలియపరిచాడు.

వీరబాబు ఆత్మాభిమానం దెబ్బతిన్నది. తన స్వయం కృషితో కష్టపడి కట్టుకున్న ఇల్లుండగా మరొకరి సహాయానికి చేయిచాచి అర్థించడం నామోషి అనిపించంది. సగం పోర్షను ఇల్లు సేల్ చేసి కూతురి పెళ్ళి చేసేశాడు. అక్షింతలు వేసి వెళ్ళిపోయారు. ఎప్పుడన్నా సొంత వూరు, ఇంటికి వచ్చినా భార్యని పుట్టింట్లో దిగబెట్టి, దూరపు బంధువులా తల్లీతండ్రిని చూడ్డానికొచ్చే వాడు. ఆప్యాయంగా పలుకరించే తల్లితో - ''తనకిక్కడ అన్ని సదుపాయాలు దొరకవని రాలేదు, నేను వొచ్చాను కదా!'' అంటూ తేలిగ్గా కొట్టి పారేసేవాడు నరసింహం. అందరి హృదయాల్లో సత్యవతి ఒక అహంభావి గల వ్యక్తిగా ముద్రపడి పోయింది. ప్రేమించే మనసుండాలి గాని ఈ డబ్బు, అందచందాలు అడ్డు వస్తాయా అనుకున్నారు. తల్లి మంచానపడినప్పుడు కూడా నరసింహం అత్తగారింట్లోనే తిష్టవేశాడు. ఆఖరి శ్వాస విడిచిందని తెలిసిన తరువాత ఇద్దరూ వచ్చి పూలదండవేసి వెళ్ళారు. సత్యవతి అదుపాజ్ఞల్లో నరసింహం నడుస్తున్నాడని అంతా నిందలు, నిష్ఠూరాలు వేసినా తను అన్నింటికీ అతీతుడన్నట్టుగా ముఖం చాటేసి వెళ్ళిపోయాడు.

నరసింహం కొడుకు ప్రవీణ్ తాతగార్ని చూడాలని ఎన్నిమార్లు అడిగినా సత్యవతి మాత్రం వెళ్ళనిచ్చేది కాదు. మనవడ్ని చూడాలన్న ఆవేదనతో కోరి పిలిచినా, అపేక్షలు, రాకపోకలు మళ్ళీ చిగురిస్తాయేమోనని కలవకుండా చేసింది సత్యవతి.

ఒక రోజు అకస్మాత్తుగా పోస్ట్‌మేన్ టెలిగ్రామ్ తెచ్చి ప్రవీణ్ చేతిలో పెట్టాడు.

'వీరబాబు చనిపోయినట్టు వెంటనే రమ్మనమని' అందులో సారాంశం.

సత్యవతి ఆ టెలిగ్రామ్ ఎవరికీ కనపడకుండా సొరుగులో దాచేసింది. నరసింహం ఇంటికి రాగానే ప్రవీణ్ టెలిగ్రామ్ సంగతి చెప్పాడు.

''ఏది టెలిగ్రామ్ చూడనీ'' అత్రుతగా అడిగాడు.

''అదేలెండి, ఎప్పట్నించో మీ నాన్న గారు మంచం పట్టేశారు కదా, బాగా వయసైపోయింది, నిన్ననే పోయినట్టు టెలిగ్రామ్ ఇచ్చారు...''

''నాన్న చనిపోయారా?'' ఏదో అశనిపాతంలా మెదడులోని నరాలు పేలిపోయినట్టు, వెలుగువున్నా కళ్ళు చీకట్లు కమ్మాయి. కన్న తండ్రి గుండెలపై మోసి, పెంచి పెద్ద చేసిన మహోన్నత వ్యక్తి మరిక లేడు, కనపడడు అన్న నిజాన్ని భరించలేక, గుండెల్లో నుండి పుట్టెడు దుఃఖం తన్నుకొచ్చింది.

నరసింహం బయలుదేరడానికి ఉద్యుక్తుడయ్యాడు. సత్యవతి ఆవేశంగా లేచింది. ''మీరు వెళ్ళడానికి వీల్లేదు. ఏం ముఖం పెట్టుకొని వెళ్తారు? అక్కడ మీ మాటకేమన్నా విలువుందా? మీ తమ్ముడు మనల్ని ఎన్ని అనరాని మాటలు అన్నాడు. అవన్నీ మరిచిపోయారా. కోడలుగా ఆ ఇంటి బాధ్యత లేమిటో తెలుసా అని పెద్దా చిన్నా తారతమ్యం లేకుండా తూలనాడి, చివరికి మీ ఇంట్లో అందరి దృష్టిలో నేనొకగయ్యాళిగా తీర్చిదిద్దారు మీ వాళ్ళు. నన్నంటే మిమ్మల్నన్నట్టు కాదా? అంతా వెలివేశారు. మన అవసరం వాళ్ళకు లేనప్పుడు వాళ్ళేమైపోతే మనకేంటి? మీరెంత మాత్రం వెళ్ళడానికి వీల్లేదు. మీకోసం ఎవరూ ఎదురు చూడరు. ప్రేమించే మనసు వాళ్ళకు లేనప్పుడు ఆదరించే అవసరం మనకూ ఉండదు'' అంటూ అప్పటి వరకు తనలో రేగుతున్న మంటల్ని మరింత ఆజ్యంపోసి నరసింహం గుండెల్ని మరింతగా అగ్నికి ఆహుతి చేసింది.

కొడుకుని పిలిచి జరిగిన దానికి చింతిస్తున్నామని టెలిగ్రామ్ ఇచ్చి రమ్మంది.

నరసింహం సుడిగుండంలో చిక్కుకున్న

వాడిలా విలవిలలాడిపోయాడు. అచేతనంగా పతి కిలపడిపోయాడు. తండ్రి కడసారి చూపులైనా దక్కలేదనుకున్నాడు.

ఆ రోజు నుండి నరసింహం కుటుంబ సభ్యులకు, బంధువులకు దూరమైపోయాడు. ఋణానుబంధాలన్నీ భూస్థాపితమైపోయాయి.

ooo

''వాళ్ళు మన కన్నా స్థితిమంతులు. మనతో నెయ్యమందటానికి ఎంతో ఇష్టపడుతూ అడుగుతున్నారు. అదంతా నీ అదృష్టం అనుకో'' అంటూ మెచ్చుకోలుగా నరసింహం తన కొడుకుని, భార్యను చూస్తూ ఆగాడు.

''అవునవును'' అంటూ సత్యవతి వంత పలికింది.

''డబ్బుదేముంది ఈ రోజు కాకుంటే రేపు సంపాదించుకోవచ్చు. పెళ్ళనేది జీవితాంతం ముడిపడేది. ఆ అమ్మాయిని మీరు చూశారు కదా, ఎలా చేసుకుంటాననుకుంటున్నారు. మీరే చెప్పండి. అయామ్ సారీ, నాకు నచ్చలేదు'' అంటూ ప్రదీప్ నిర్మొహమాటంగా చెప్పాడు.

అది విని సత్యవతి చివాలున లేచింది కోపంగా.

''ప్రదీప్ అదే నీ ఆఖరి మాటయితే, నా మాటకూడా విను. ఇది మన ఇంటి పరువు ప్రతిష్టలకు సంబంధించిన వ్యవహారం. నా మాట మీద నీకే మాత్రం గౌరవం, ప్రేమ వున్నా ఈ అమ్మాయినే పెళ్ళి చేసుకుంటావ్. కాదని తిరస్కరించావో పచ్చి మంచినీళ్ళయినా పుచ్చుకోకుండా ప్రాణాలు తీసుకుంటాను, ఆలోచించుకో'' అంటూ కడసారి బాణం ఎక్కుపెట్టింది సత్యవతి కొడుకు మీదికి.

నరసింహం గుండె గుభేలుమంది.

ప్రదీప్, తల్లి చేసిన సవాల్‌ను ఎదుర్కోవడానికి శక్తిలేని వాడిలా బేలగా తండ్రి వైపు చూడసాగాడు.

''ఏంటమ్మా, నీ మంకుపట్టు, నీలాగే ఇంటి పట్టునే ఉండవలసిన రోజులు కావివి. నా లైఫ్ పార్టనర్ నాతో సమానంగా అన్నింటికీ వస్తుంది. నాకు తగిన పర్సనాల్టీ లేకపోతే ఎంత ఇన్సల్ట్, లేకపోతే నేను పెళ్ళి చేసుకోను, బ్యాచిలర్‌గా ఉండిపోతాను'' అంటూ డాంబికంగా పలికి, విసురుగా వెళ్ళిపోయాడు.

నరసింహం అయోమయంగా మాటలు రాని వాడిలా ఉండిపోయాడు. సత్యవతి మొదట్నించి అనుకున్నది సాధించే మనస్తత్వం గలది, పట్టుదల పెంచుకుంది.

ఆ రోజు రాత్రి నుండి ఉపవాసాలు మొదలు పెట్టింది. మరుసటి రోజు ఉదయాన్నే లేచి వంట




చేసి డైనింగ్ టేబిల్ మీద అన్నీ రెడీచేసి, తను మాత్రం ఏమీ తినకుండా మంచమెక్కింది. నరసింహం, ప్రదీప్ ఒక కంట కనిపెడుతూనే ఉన్నారు. రాత్రికి ఇంటికి తిరిగి వచ్చిన ఇద్దరూ సత్యవతి లంఖణాలు కంటిన్యూ చేయడం చూసి గాబరా పడ్డారు.

మరోరోజు గడిచింది. మంచం మీది నుండి లేవలేని పరిస్థితి కనిపించింది. నోరువిప్పి మాట్లాడలేక సైగలు చేయడం చూసి ఇద్దరిలో ఆందోళన కలిగించింది. ఆ రోజు నుండి నరసింహం కూడా కొడుకు మీద కోపం వచ్చి అలిగినట్టు తను కూడా తినడం, తాగడం మానేశాడు.

ప్రదీప్ వీరిద్దరు పెడుతున్న మానసిక హింసను భరించలేకపోయాడు. తల్లి తండ్రి రోజురోజుకీ నీరసించి, చిక్కిపోతున్న పరిస్థితిని చూసి ప్రదీప్ కూడా చేతగాని వాడిలా నీరుగారిపోయాడు. హృదయం ద్రవించింది.

''అమ్మా! లేచి కూర్చో, ఈ పంతాలు పట్టింపులు మానండి, ఈ అమ్మాయినే చేసుకుంటాలే'' అంటూ ఫ్రిజ్‌లోని ద్రాక్షరసం చెరొక గ్లాసులో పోసి ఇద్దరికీ అందించాడు.

తన మనసుకు వ్యతిరేకంగా ఈ పెళ్ళికి ఒప్పుకున్నందుకు ప్రదీప్‌కి జీవితమంటేనే రోత పుట్టినట్టు నిరాశ పడిపోయాడు. సత్యవతికి మాత్రం కొండంత ధైర్యం బలం వచ్చినంతగా మురిసిపోయింది.

ఆరోజు సాయంత్రం శాంత్రో కారులో ముగ్గురూ బయలుదేరారు. ప్రదీప్ కారు డ్రైవ్ చేస్తుంటే పెళ్ళి వారింటికి చేరుకున్నారు.

కారు దిగీదిగ్గానే నౌకరు ఎదురొచ్చి దండం పెడుతూ - ''అమ్మగారు, అయ్యగారు, ఎవరూ లేరమ్మా'' అని చల్లగా కబురందించాడు.

''ఏం! ఎక్కడికెళ్ళారు, ఎప్పుడొస్తారు'' మగ పెళ్ళి వారి హోదాలో కుతూహలంగా అడిగాడు నరసింహం.

''అంతా రిజిస్ట్రార్ ఆఫీసుకట ఎళ్ళారయ్యా!''

''ఎందుకూ?'' ఆతృతగా అడిగింది సత్యవతి.

''అమ్మాయిగారి పెళ్ళి కదమ్మా'' అన్నాడు నెమ్మదిగా. వెంటనే ప్రదీప్ ఉద్విగ్నతతో ముందుకు కదిలాడు.

''పెళ్ళా! ఇప్పుడా, ఎవరితో'' అని అడిగింది సత్యవతి ఆశ్చర్యంతో తలమునకలవుతూ.

''మీకు తెలియదా అమ్మగారు, ఆ దత్తుగారి అబ్బాయి ఎంతో ఇష్టపడి అమ్మాయి గార్ని ఏరి, కోరి చేసుకుంటానంటే, అందరూ రెండు కార్లల్లో ఎళ్ళారమ్మా'' అన్నాడు నౌఖరు. అతడలా చెప్పే సరికి వెయ్యి టన్నుల బాంబు పేలినట్టనిపించింది సత్యవతికి, నరసింహంకి, ప్రదీప్‌కి కూడా.

అప్పటికే కళ్ళు గిర్రున తిరిగి తలదిమ్మెక్కిపోయింది. నిలుచున్న పాటునే వేగంగా వెనక్కు తిరిగి కారులో ఎలా కూర్చున్నారో వారికే తెలియదు తిరుగు ప్రయాణానికి.